Fri, 02 Feb-18; Eenadu - Hyderabad; Size : 246 sq.cm.; Circulation:48130;
Page : 20

# మదుపరికి ఇబ్బందే

- → రూ.లక్షకు పైన 10% విధింపు
- → ఎఫ్‌పీఐలు, మ్యూచువల్ ఫండ్‌లపైనా

దిల్లీ

స్టాక్ మార్కెట్ మదుపర్లకు రుచించని బడ్జెట్ ప్రతిపాదన ఇది. రూ.లక్షకు పైబడ్డ ఈక్విటీ లాభాలపై 10 శాతం దీర్ఘకాల మూలధన లాభాల(ఎల్‌టీసీజీ) పన్నును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పన్ను ఎగవేతలను అరికట్టే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. 'పన్ను మినహాయింపు లేకుండా కూడా స్టాక్ మార్కెట్ల నుంచి వస్తున్న ప్రతిఫలాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. పన్ను పరిధిలోకి నమోదిత కంపెనీల ద్వారా వచ్చే దీర్ఘకాల మూలధన లాభాలను తీసుకురావాల్సిన అవసరం ఉంద'ని ఈ సందర్భంగా జైట్లీ అన్నారు. అయితే ఆర్థిక వృద్ధికి ఒక ఉజ్జ్వల ఈక్విటీ మార్కెట్ అత్యవసరం కాబట్టి ప్రస్తుత బడ్జెట్‌లో ఓ మోస్తరు మార్పులనే చేపడుతున్నాం. రూ.1 లక్షకు పైబడ్డ లాభాలపై మాత్రమే 10 శాతం పన్నును విధిస్తున్నామ'ని ఆయన అన్నారు. జనవరి 31, 2018 వరకు వచ్చిన లాభాలను మాత్రం పరిగణనలోకి తీసుకోమని.. ఆ తర్వాత వచ్చిన లాభాలనే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఇప్పటి వరకూ ఒక ఏడాది తర్వాత జరిపే షేర్ల విక్రయాల ద్వారా వచ్చే లాభాలను మూలధన లాభాల పన్ను నుంచి మినహాయించిన సంగతి తెలిసిందే. (అయితే ఏడాదిలోపు విక్రయాలపై 15% పన్ను ఉంటోంది.)

**ఎఫ్‌పీఐలకూ:** దేశీయ మదుపర్ల తరహాలోనే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) మన స్టాక్ మార్కెట్ల ద్వారా వచ్చే దీర్ఘకాల మూలధన లాభాలపై 10 శాతం పన్నును చెల్లించాల్సి వస్తుంది.

**మ్యూచువల్ ఫండ్‌లపైనా 10%:** ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్‌ల నుంచి వచ్చే ఆదాయం (డిస్ట్రిబ్యూటెడ్) పైనా మదుపర్లు 10 శాతం పన్నును కట్టాల్సి వస్తుంది. ఇటీవలి కాలంలో మ్యూచువల్ ఫండ్‌లకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో తాజా పరిణామం సెంటిమెంటును దెబ్బతీస్తుందని హెచ్‌డీఎఫ్‌సీ ఏఎమ్‌సీ ఛైర్మన్ దీపక్ పరేఖ్ పేర్కొన్నారు. షేర్లు, బాండ్లు, డిబెంచర్లు, డెరివేటివ్స్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లపై వర్తించే సెక్యూరిటీల లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ)కు ఇది అదనం.




**దీర్ఘ కాల మూలధన లాభాలపై పన్ను**

**రూ.1,00,000 కోట్లు**
గతేడాది మ్యూచువల్ ఫండ్‌లు స్టాక్ మార్కెట్లలో పెట్టిన పెట్టుబడులు

**రూ.20,000 కోట్లు**
మూలధన లాభాలపై పన్ను వల్ల తొలి ఏడాదిలో ఖజానాకు వచ్చే ఆదాయం

"ఒకేసారి రెండు పన్నులు(ఎస్‌టీటీ, ఎల్‌టీసీజీ) ఉన్న ఏకైన దేశం మనదేనేమో. అయితే మార్కెట్ సెంటిమెంట్‌పై భారీ ప్రభావం ఏమీ ఉండదు. జనవరి 31 వరకు ఎల్‌టీసీజీని లెక్కవేయకపోవడం(గ్రాండ్‌ఫాదరింగ్) వల్ల స్టాక్ మార్కెట్లలో ఊగిసలాటను అదుపులో పెట్టినట్లయింది."

**- రిలయన్స్ సెక్యూరిటీస్ సీఈఓ బి. గోప్‌కుమార్**